విశాఖపట్టణం
శుక్రవారం 25 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 224 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## గజల్ గాంధర్వునికి విశ్వ సంగీత శాంతి దూత పురస్కారం

మారిషస్ గడ్డపై డా. గజల్ శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం



8




## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం

**విపక్ష పార్టీల సంచలన నిర్ణయం**

**ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్లాన్**

**దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపు అంశం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలు.. ఏకంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌పై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించాయి. వచ్చే రెండు వారాల్లో ఉభయ సభల్లోనూ దీనికి సంబంధించిన నోటీసు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ విపక్షాలను ఏకతాటిపైకి తెస్తోంది.

ఈ అభిశంసన నోటీసు ముసాయిదాను ప్రస్తుతం న్యాయ నిపుణులు పరిశీలిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్ష ఇండియా కూటమి కలిసికట్టుగా ఈ నోటీసును సిద్ధం చేస్తోందని పేర్కొన్నాయి. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించేందుకు విపక్షాలు ప్రయత్నించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. గతంలో లోక్‌సభ, రాజ్యసభల్లో ఇచ్చిన మొదటి నోటీసు తిరస్కరణకు ..మిగతా 2లో

# వర్షపు నీటిని వృథా చేయొద్దు

**రిజర్వాయిర్‌లు, చెరువులను నింపాలి**

**వర్షాలతో కొంతమేర భూగర్భ జలాలు మెరుగు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు**

**ఆర్టీజీఎస్‌లో పలు శాఖలతో సమీక్ష**






(అమరావతి - జయజయహే)

వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు.

పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని ..మిగతా 2లో

# జీసీసీలు ఏర్పాటు చేయండి

**ఏపీలో అపారమైన అవకాశాలు**

**వివో, సిస్కో, అబాట్, మాస్టర్‌కార్డ్, శాప్‌కు లోకేశ్ ఆహ్వానం**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. గురువారం ఈ పర్యటనలో భాగంగా ఆయన వివిధ విదేశీ సంస్థలకు చెందిన ప్రతినిధులతో ఆయన వరుస భేటీలు అవుతున్నారు. పలు సంస్థల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు ఉన్న వనరులను వారికి మంత్రి లోకేశ్ సోదాహరణంగా వివరిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్, యాక్సెసరీస్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. వివో సరఫరాదారుల కోసం ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్'ను అభివృద్ధి చేయాలని కూడా ఆయనను కోరారు. దీనిపై అర్జిత్ సేన్ ..మిగతా 2లో



## లిక్కర్ స్కామ్ రాజ్ కేసిరెడ్డికి బెయిల్

**వాసుదేవరెడ్డికి కూడా మంజూరు**

**దర్యాప్తునకు సహకరించాలని ఈడీ కోర్టు ఆదేశం**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు ఈడీ ప్రత్యేక కోర్టు ఉపశమనం కలిగించింది. షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులు ఇద్దరూ లక్ష రూపాయలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి ఎక్కడికీ వెళ్లకూడదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉన్న సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయడానికి లేదా ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించింది. ఈడీ అధికారులు పిలిచినప్పుడల్లా విచారణకు హాజరై, దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోర్టు ఆదేశించింది.



## ఓయోలో యువతి మృతి కేసులో ట్విస్ట్

**ప్రియుడు రవితేజ ఆత్మహత్యాయత్నం**

**పరవాడలోని స్వగృహంలో ఘటన**

**ఆసుపత్రిలో చికిత్స**

**హైదరాబాద్ పోలీసులకు పరవాడ ఖాకీల సమాచారం**

(విశాఖపట్నం - జయజయహే)

హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓయో హోటల్‌లో యువతి అనుమానాస్పద మృతి కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీనివాస రవితేజ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. అనకాపల్లి జిల్లా పరవాడ ..మిగతా 2లో

## ఖైరతాబాద్‌లో ఉపఎన్నికే..!

**అనర్హత పిటీషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం**

**హైకోర్టు తీర్పునకు సమర్థన**



(హైదరాబాద్ - జయజయహే)

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద తనపై తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని, అక్కడ ఉపఎన్నికలకు వెళ్లాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని రంగంలోకి దించినప్పటికీ, దానం నాగేందర్‌కు ఎలాంటి ఉపశమనం లభించలేదు. విచారణ సమయంలో ధర్మాసనం , లాయర్ రోహత్గీ మధ్య ఆసక్తికరమైన వాదనలు జరిగాయి. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలను ప్రస్తావిస్తూ స్పీకర్ గతంలో ఇచ్చిన ఆర్డర్ శైలిపై జస్టిస్ బాగ్చి తీవ్ర వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనిపై రోహత్గీ వాదిస్తూ.. పార్టీ ఫిరాయింపులలో క్షమాపణ, ఘర్ వాపసీ అనే అంశం కూడా ..మిగతా 2లో



## భోగాపురం ఎయిర్ పోర్టు బిజీ..బిజీ..!

**భోగాపురం - న్యూ ఢిల్లీకి డైలీ సర్వీసులు**

**అక్టోబర్ 25 నుంచి అమలుకు అకాశ ఎయిర్ నిర్ణయం**

**అక్టోబర్ 27 నుంచి భోగాపురం టు బ్యాంకాక్**

**వారానికి రెండుసార్లు విమాన సర్వీసులు**

2

# జీసీసీలు ఏర్పాటు చేయండి

**మొదటి పేజీ తరువాయి...**

సానుకూలంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని ఈ సందర్భంగా వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ వెల్లడించారు.

**సిస్కో ఇండియా ఎండీ హరీశ్ కృష్ణన్‌తో సమావేశం**

ఆంధ్రప్రదేశ్‌లో డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా యూనిఫైడ్ కంప్యూటింగ్ సిస్టమ్ సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిస్కో ఇండియా ఎండీ హరికృష్ణన్‌కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, కొలాబరేషన్ అండ్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఖ్యాతిగాంచిన సిస్కో సిస్టమ్స్ (యుఎస్‌ఏ) ఎండీ (ఇండియా, సౌత్ ఈస్ట్ ఆసియా) హరీశ్ కృష్ణన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ ఎకో సిస్టమ్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఉత్పత్తి వల్ల కలిగే ప్రయోజనాలు (ఎకానమీస్ ఆఫ్ స్కేల్) సాధించడానికి, డేటా సెంటర్ వాల్యూ చైన్ మొత్తం వ్యవస్థను రాష్ట్రంలోకి ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. అలాగే విశాఖపట్నంలో ఇంజనీరింగ్ సెంటర్ / జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 50వేల మంది యువతను నెట్‌అకాడ్ యాక్సెస్, ఐటీ, ఇతర పరిశ్రమల్లో అత్యంత నైపుణ్యం గల శ్రామిక శక్తిగా అభివృద్ధి చేయడానికి ఏపీ ప్రభుత్వంతో గత ఏడాది మార్చిలో ఒప్పందం చేసుకున్నామని హరీశ్ కృష్ణన్ గుర్తు చేశారు. ఈ ప్రోగ్రామ్ ఇప్పటికే అమలులో ఉందని తెలిపారు. విశాఖపట్నంలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సీఓఈ, విజయవాడ స్మార్ట్ సిటీ, ఏపీ ఫైబర్‌నెట్(22,500 కి.మీ.) ప్రాజెక్టుల్లో తాము భాగస్వామ్యంగా ఉన్నామని అన్నారు. అలాగే ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హరీశ్ కృష్ణన్ వెల్లడించారు.

**అబాట్ ఇండియా ఎండీకి లోకేశ్ విజ్ఞప్తి**

ఆంధ్రప్రదేశ్‌లోని ఏఎంటీజెడట్ / ఈఎంసీలలో ఓ చోట వైద్య పరికరాలు / డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా అబాట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఇస్తేయాక్ అంజాద్‌ను మంత్రి లోకేశ్ కోరారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ



కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ పార్క్‌లో అనుకూలమైన భూమి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వినియోగ సేవలు, ఇతర రాష్ట్రాలకు మించిన విధానపరమైన మద్దతు ఉంటాయని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో అబాట్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అబాట్ ఎండి అంజాద్ మాట్లాడుతూ... తమ సంస్థ భారత్ లో 400కు పైగా ఫార్మా బ్రాండ్లు, 12వేలకు పైగా ఉద్యోగులను కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుతం గోవా, బద్ది (హిమాచల్ ప్రదేశ్), ఝగాడియా (గుజరాత్)లలో తయారీ కేంద్రాలు, ముంబై, న్యూఢిల్లీలలో కార్యాలయాలు ఉన్నట్లు వివరించారు. పోషకాహారం , ఫార్మా ఉత్పత్తుల కోసం స్థానిక ప్రఖ్యాత సంస్థల్లో పెట్టుబడులకు తాము ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అంజాద్ పేర్కొన్నారు.

స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం వహించి, వాటిని ప్రోత్సహించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ )లో ఫిన్‌టెక్ సలహాదారు సభ్యునిగా చేరాలని ప్రముఖ గ్లోబల్ పేమెంట్స్, టెక్నాలజీ సంస్థ మాస్టర్ కార్డ్ ఇంక్ (యుఎస్‌ఏ) వైస్ ప్రెసిడెంట్, గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ అభిషేక్ లాహిరిను మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. విశాఖపట్నంలో భూమి లభ్యత, ఐటీ, జీసీసీ పాలసీ మద్దతుతో జీసీసీ / టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని లాహిరికి విజ్ఞప్తి చేశారు. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో సీఎస్‌ఆర్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, పీ4 కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించాలని విన్నవించారు. మాస్టర్‌కార్డ్ తన 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్'ను రాజమండ్రి, కోనసీమ ప్రాంతంలో అమలు చేసిందని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించే ఈ చొరవకు సహకరించిన తొలి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని గుర్తు చేశారు. ఏపీలో మరిన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సహకారం అందించాలని ఈ సందర్భంగా లాహిరిని మంత్రి లోకేశ్ కోరారు. భారత్‌లో పూణె, గుర్‌గాం, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, వడోదరలో కార్యాలయాల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాస్టర్ కార్డ్ 2వేలమంది ఉద్యోగులను కలిగి ఉందని మాస్టర్ కార్డు వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరి తెలిపారు. 6వేల మంది టెక్నాలజిస్టులతో ప్రపంచంలో అతిపెద్ద టెక్ హబ్‌ను పూణెలో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్త "ప్రైస్‌లెస్" ప్లాట్‌ఫామ్ ద్వారా దిండి, తిరుపతి, సూర్యలంక, అరకు / వైజాగ్‌లను ప్రోత్సహించడానికి ఏపీ టూరిజం అథారిటీతో ఎంఓయు చేసుకున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని లాహిరి చెప్పారు.

**ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయండి: శాప్ వైస్ ప్రెసిడెంట్‌కు లోకేశ్ విజ్ఞప్తి**

ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, ఎస్ఎంఇ డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి కోసం డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని శాప్ వైస్ ప్రెసిడెంట్ లవనీష్ చనానాకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు శాప్ అభివృద్ధి, సర్టిఫికేషన్ అందించడానికి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. భారత్‌లో ఎంటర్‌ప్రైజెస్, ప్రభుత్వ రంగ సంస్థలు , బ్యాంకులు, వివిధ ప్రభుత్వ విభాగాలకు తాము సాంకేతిక సేవలు అందిస్తున్నట్లు శాప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చనానా చెప్పారు. శాప్ ల్యాబ్స్ ఇండియా.. ప్రపంచవ్యాప్తంగా శాప్ రెండవ అతిపెద్ద ఆర్ అండ్ డీ హబ్ అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఇది గ్లోబల్ ప్రొడక్ట్, బిజినెస్ ఏఐ విడుదలకు దోహదపడుతుందని తెలిపారు. బెంగళూరులో కొత్తగా 15వేల సీట్లతో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని మంత్రి లోకేశ్‌కు హామీ ఇచ్చారు.



## భోగాపురం ఎయిర్ పోర్టు
# బిజీ..బిజీ..!

**(విశాఖపట్నం - జయజయహే)**

భోగాపురం-న్యూఢిల్లీ మధ్య అక్టోబర్ 25, 2026 నుండి ఆకాశ ఎయిర్ ఒక కొత్త విమాన సర్వీసు నడపనుంది. ఈ విషయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు కార్యాలయం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఈ విమానం న్యూఢిల్లీ నుండి ఉదయం 5:55 గంటలకు బయలుదేరి, ఉదయం 8:20 గంటలకు భోగాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇది భోగాపురం నుండి ఉదయం 9:05 గంటలకు బయలుదేరి ఉదయం 11:30 గంటలకు న్యూఢిల్లీ చేరుకుంటుంది. విమాన ప్రయాణానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం నుండి వివిధ ప్రాంతాలకు మరిన్ని విమానాలను నడిపేందుకు అనేక విమానయాన సంస్థలు ముందుకు వస్తున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ అదనపు విమాన సర్వీసు ఉత్తరాంధ్ర ప్రాంతం, న్యూఢిల్లీకి చెందిన ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

**అక్టోబర్ 27 నుంచి భోగాపురం-బ్యాంకాక్**

అక్టోబర్ 27 నుంచి భోగాపురం-బ్యాంకాక్ మధ్య ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వారానికి రెండుసార్లు విమాన సర్వీసును ప్రారంభించనుంది. ఈ ప్రాంతానికి ఇది ఒక కీలక మలుపు అని విమాన ప్రయాణికులు అభివర్ణిస్తున్నారు. భోగపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అక్టోబర్ 27న ఈ సర్వీసు ప్రారంభం అవుతుంది. సంవత్సరాల తరబడి చేసిన కృషి ఫలితంగా ఆ తేదీ నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ భోగాపురాన్ని బ్యాంకాక్‌తో కలుపుతూ నేరుగా సర్వీసులను నడపనుంది. పెద్ద ఫార్మాస్యూటికల్ రంగం, ఒక ప్రధాన ఓడరేవు, అభివృద్ధి చెందుతున్న ఐటీ కారిడార్లు, సముద్రపు ఆహార ఎగుమతి మార్కెట్ ఉన్నప్పటికీ.. విశాఖపట్నానికి అంతర్జాతీయ కనెక్టివిటీ ఒక పెద్ద అడ్డంకిగా ఉంది. విదేశాలకు కనెక్టింగ్ ఫ్లైట్లు అందుకోవడానికి ప్రయాణికులు, వ్యాపార ప్రతినిధులు సాధారణంగా హైదరాబాద్, చెన్నై లేదా న్యూఢిల్లీ లాంటి వాటిపై ఆధారపడవలసి వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ నిరంతర విజ్ఞప్తుల ఫలితంగా ఈ సర్వీసు ప్రారంభమవుతోంది. ఇది ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కల. విశాఖపట్నాన్ని థాయిలాండ్ రాజధానితో అనుసంధానించడం ద్వారా ఈ మార్గం పలు ఆర్థిక రంగాలకు సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

విడుదలైన విమాన షెడ్యూల్ ప్రకారం, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వారానికి రెండుసార్లు ఈ సర్వీసును నడుపుతుంది. ఫ్లైట్ ×ఠ 904 ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరుతుంది. అక్కడి స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4 గంటలకు బ్యాంకాక్‌లో దిగుతుంది. తిరుగు ప్రయాణ విమానం, ×ఠ 903 బుధవారాలు, శనివారాలు తెల్లవారుజామున బ్యాంకాక్ కాలమాన ప్రకారం.. 2.10 గంటలకు బ్యాంకాక్ నుండి బయలుదేరి, భారత కాలమాన ప్రకారం.. తెల్లవారుజామున 3.55 గంటలకు విశాఖపట్నంలో చేరుకుంటుంది. ప్రారంభ వన్-వే ఎకానమీ ఛార్జీలు రూ.16,300 నుండి రూ.19,400 మధ్య ఉండటంతో, ఈ ఫ్లైట్స్ వారాంతపు విహార యాత్రికులకు, కార్పొరేట్ ప్రయాణికులకు ఇద్దరికీ అనుకూలంగా ఉంటుంది.

# వర్షపు నీటిని వృధా చేయొద్దు

**మొదటి పేజీ తరువాయి...**

పంపాలన్నారు చంద్రబాబు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు-వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఏలేరు రిజర్వాయర్‌కు 21,200--26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000--7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,400-3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100--3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి--వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరించారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్--1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్--1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్--1, సాయంత్రం వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు.

అక్టోబరు 2 తేదీన ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు ముఖ్యమంత్రి. మైక్రోసాఫ్ట్ సహకారంతో రూపొందించిన ఏఐ స్టాక్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ డెమో ఇవ్వాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచకపోయినా సేవల్లో లోపాల కారణంగా ప్రజల్లో సంతృప్తి తగ్గుతోందని, సరఫరా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 287.214 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న నేపథ్యంలో.. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి లభ్యతపైనా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

# ఖైరతాబాద్‌లో ఉపఎన్నికే..!

**మొదటి పేజీ తరువాయి...**

ఉంటుందని, నాగేందర్ ఇప్పటికీ తన సొంత పార్టీతోనే ఉంటూ సమావేశాలకు హాజరవుతున్నారని కాపాడే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో అంటరానితనాన్ని, పొరపాట్లను తుడిచేందుకే రాజ్యాంగం ఇలాంటి వెసులుబాటు కల్పించిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.అయితే, ఈ ఘర్ వాపసీ ప్రతిపాదనను జస్టిస్ బాగ్చి ఏమాత్రం ఆమోదించలేదు. స్వచ్ఛందంగా ఒక పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని వదులుకున్న మరుక్షణమే అసెంబ్లీ సభ్యత్వాన్ని శాశ్వతంగా కోల్పోతారు అని స్పష్టం చేశారు. ఈ రకమైన వ్యూహాలు అనర్హత నుంచి కాపాడలేవని తేల్చిచెప్పారు. మీరు తిరిగి మీ సొంత పార్టీలోకి వెళ్లవచ్చు, కానీ కోల్పోయిన ఎమ్మెల్యే పదవి మాత్రం పునరుద్ధరణ కాదు. అంతగా కావాలనుకుంటే మీ పార్టీ మిమ్మల్ని రాజ్యసభకు పంపుకోవచ్చు అని కోర్టు అత్యంత ఘాటుగా వ్యాఖ్యానించింది. రెండు పార్టీల తరఫున ఒకేసారి చక్రం తిప్పే ప్రయత్నం చేయడం, బి-ఫారాలు తీసుకుని ఎంపీగా పోటీ చేసి, తిరిగి ఎమ్మెల్యే సీటును రక్షించుకోవాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం తేల్చేసింది. 2023లో బీఆర్ఎస్ తరఫున గెలిచి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడం ద్వారా పదో షెడ్యూల్ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించారని ధర్మాసనం అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించడంతో నాగేందర్ సభ్యత్వం అధికారికంగా రద్దయింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. రాజ్యాంగ స్ఫూర్తిని, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రధాన ఉద్దేశాన్ని కాపాడేలా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఇది ఒక గట్టి హెచ్చరికగా నిలవడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఊహించని రాజకీయ పరిణామాలకు దారితీసే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.




# యూనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ నేషనల్ అవార్డు

**విశాఖపట్నం /పెందుర్తి (జయ జయహే)**

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్ లో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా, పెందుర్తి కి చెందిన యూనిక్ స్కూల్ డైరెక్టర్ కు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు గెడ్డం ప్రసాద్ ,పొన్నం ప్రభాకర్ ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రముఖ నటులు సుమన్ తల్వార్ , బాబు మోహన్ పాల్గొన్నారు. విశాఖపట్నం కి చెందిన ఆదినారాయణ విద్యార్థులకు, విద్యా రంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. పాఠశాల విద్యార్థులకు నూతన విద్యా విధానంలో పాఠాలు బోధించడం, అతి తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యను అందించడం, విద్యార్థులకు ఐ ఐ టి బోధన వంటివి ఎంతో గొప్ప విషయాలు అని, సమాజానికి ఆదినారాయణ సేవ చేస్తూ 98 మార్లు రక్తదానం చేసి ఎంతో మంది జీవితాలను కాపాడారు.ఈరోజు విద్యార్థులకు ఇలాంటి ఉత్తమ ఉపాధ్యాయుల అవసరం చాలా అవసరం అని మంత్రి పొంగులేటి వ్యాఖ్యనించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డీన్ విశాలాక్షి, డైరెక్టర్లు పరమేష్, మల్లిక పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం

**మొదటి పేజీ తరువాయి...**

గురికాగా, ఏప్రిల్ 24న 73 మంది ఎంపీలు ఇచ్చిన మరో నోటీసు రాజ్యసభలో పెండింగ్‌లోనే ఉంది. అయితే, ఓటర్ల జాబితాల సవరణలో జరుగుతున్న అక్రమాలపై ఇటీవల ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన కథనం వెలుగులోకి రావడంతో విపక్షాలు కొత్తగా మరొకసారి అభిశంసన తీర్మానం ఇవ్వాలని నిర్ణయించాయి.

**దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపు**

మరోవైపు, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ పోరాటానికి దిగింది. సెప్టెంబర్ 25న అన్ని రాష్ట్రాల ప్రధాన నగరాల్లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయాల ముట్టడికి కాంగ్రెస్ తమ రాష్ట్ర కమిటీలను ఆదేశించింది. అలాగే సెప్టెంబర్ 28న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. "బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ చేపడుతున్న 'భారీ ఓట్ల చోరీ'ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి నుంచి ఎండగడుతున్నారు. ఆయన చేసిన రాజ్యాంగ విరుద్ధ చర్యలు ఇప్పుడు బయటపడ్డాయి. ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

**ఎన్నికల కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు**

గత ఏడాది ప్రారంభమైన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పది నెలల కాలంలో తోటి ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి కనీసం 14 సార్లు తమ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం స్పష్టం చేసింది. ఓటర్ నమోదు ఫారం-6 సవరణ, ఓట్ల చేరికలు-తొలగింపుల నిర్వహణ, సెంట్రలైజ్డ్ డేటాబేస్‌పై సీఈసీ ఏకపక్ష ఆధిపత్యం వహించడంపై వారు ప్రశ్నించినట్లు సదరు కథనం పేర్కొంది. అయితే ఈ కథనంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందిస్తూ.. "ఒక వ్యవస్థలో వివిధ అంశాలపై విభిన్న అభిప్రాయాలు ఉండటం సహజం. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రతి అధికారికి సూచనలు ఇచ్చే హక్కు ఉంది. కమిషన్ జారీ చేసే అన్ని ఉత్తర్వులు చట్టబద్ధమైన పరిధిలోనే ఉంటాయి" అని వివరణ ఇచ్చింది.

## ఓయోలో యవతి మృతి
# కేసులో ట్విస్ట్

**మొదటి పేజీ తరువాయి...**

మండలం ఈ-మర్రిపాలెంలోని తన స్వగ్రామంలో బుధవారం ఇంట్లోనే అతడు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. రవితేజకు తొలుత స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పరవాడ పోలీసులు హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. విశాఖపట్నానికి చెందిన షారోన్ నిఖిత టోప్నో.. శ్రీనివాస రవితేజతో కలిసి మాదాపూర్‌లోని సిద్దిఖీనగర్, రోడ్ నంబర్ 5లో ఉన్న ఓయో హోటల్‌కు వెళ్లింది. సెప్టెంబర్ 21న మధ్యాహ్నం ఇద్దరూ హోటల్‌లో రూమ్ తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే మంగళవారం తెల్లవారుజామున నిఖిత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో రవితేజ, హోటల్ సిబ్బంది సహాయంతో ఆమెను కొండాపూర్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నిఖిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యువతి ముఖం, తల భాగంలో గాయాలు, వాపులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హోటల్ గదిని క్లూస్ టీమ్ పరిశీలించగా గోడలు, బెడ్‌షీట్‌పై రక్తపు మరకలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. గదిలో ఖాళీ మద్యం సీసాలు కూడా గుర్తించినట్లు సమాచారం. ఈ ఆధారాలతో యువతి మృతి అనుమానాస్పదంగా మారింది. ఘటనకు ముందు హోటల్ గదిలో ఇద్దరి మధ్య ఏం జరిగిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోరెన్సిక్ ఆధారాలతో పాటు హోటల్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీ, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. నిఖిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించిన అనంతరం రవితేజ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు. ప్రత్యేక బృందాలు రవితేజ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్న సమయంలోనే అతడు తన స్వగ్రామంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఇంట్లో ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్ తాగినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రవితేజ ఆరోగ్య పరిస్థితిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మాదాపూర్ ఓయో హోటల్‌లో నిఖిత మృతి ఘటనకు సంబంధించి ఇప్పటికే పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. యువతి మృతికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? ఘటన సమయంలో హోటల్ గదిలో ఏం జరిగింది? రవితేజ ఆత్మహత్యాయత్నానికి కారణమేంటి? అనే అంశాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. రవితేజ ఆరోగ్య పరిస్థితి, అతడి వాంగ్మూలం ఆధారంగా కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### భారీ వర్షంలోనూ నిడదవోలులో

# మంత్రి దుర్గేష్ క్షేత్రస్థాయి పర్యటన

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



భారీ వర్షాల నేపథ్యంలో నిడదవోలు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మోకాల్లోతు నీటిలో నడుస్తూ బస్టాండ్, తిమ్మరాజుపాలెం కల్వర్టు, కోటసత్తెమ్మ గుడి రోడ్డు, కంసాలిపాలెం ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించారు.బస్టాండ్‌లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కంసాలిపాలెం--మాధవరం మధ్య నీటి ఉధృతి నేపథ్యంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయించారు. పట్టణంలో వేలాడుతున్న విద్యుత్ తీగలపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బస్టాండ్ డ్రైన్, తిమ్మరాజుపాలెం కల్వర్టు నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.



## "దుమ్మగూడ"లో కూలిన నిరుపేద ఇల్లు..

### బాధితులను పరామర్శించిన: వైసీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగం చాణక్య

**అరకులోయ: సెప్టెంబర్ 24 జయ జయహే.**

మండల కేంద్రంలోని పద్మపురం గ్రామ పంచాయతీ పరిధిలోగల దుమ్మగూడ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కొర్ర బలరాం తండ్రి అర్జున్ ఇల్లు సెప్టెంబర్ 22వ తేదీ రాత్రి సుమారు 1:00 గంట సమయంలో ఒక్కసారిగా ఒక వైపు నుంచి పూర్తిగా కుప్పకూలింది. అర్ధరాత్రి సమయం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని గృహోపకరణాలు సామాగ్రి పూర్తిగా దెబ్బతిన్నాయి.ఇటుక ఇల్లు కోల్పోవడం, అటుకుల్లో ఉన్న సామాగ్రి పాడవడంతో ఆ నిరుపేద కుటుంబం నిరాశ్రయులై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లు కూలిన విషయం తెలుసుకున్న వైయస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగం చాణక్య వెంటనే స్పందించారు.బాధిత కుటుంబ సభ్యులైన కొర్ర బలరాం దంపతులను కలసి పరామర్శించారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.ఈ ఘటనపై అరకు శాసన సభ్యులు రేగం మత్స్యలింగంతో పాటు సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు.ప్రభుత్వం నుండి బాధితులకు తక్షణ సహకారం అందేలా చూస్తామని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని రేగం చాణక్య భరోసా కల్పించారు.ఈ ఘటనపై బాధితులకు తక్షణమే ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించి, ఇల్లు మంజూరు చేయాలని చాణక్య కోరారు.ఈ కార్యక్రమంలో అరకు లోయ ఎస్టీ సెల్ అధ్యక్షులు పాంగి నాగేశ్వరరావు, సుంకరమెట్ట గ్రామపంచాయతీ అధ్యక్షులు కొర్ర అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో

## జగన్‌ను కలిసిన బొడ్డేడ ప్రసాద్

**మునగపాక, సెప్టెంబర్ 24, జయ జయహే:**

అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో వైసీపీ పార్టీ అధినేత వైయస్ జగన్ ను గ్రేటర్ విశాఖ నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి, రానున్న ఎన్నికల గురించి చర్చించారు.



### జగన్‌ను కలిసిన

## మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 24, జయ జయహే**



రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తో కలిసి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు మర్యాద పూర్వకంగా కలిసి వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మన పార్టీ కుటుంబ సభ్యులు అందరూ సమన్వయము చేసుకుంటూ కష్టపడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతి అభ్యర్థిని గెలిపించి తీసుకురావాలి అని సూచనలు చేసినట్లు బాబురావు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు .

# రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

### మండల వ్యవసాయాధికారిణి ఎల్. వై కాంతమ్మ



**దేవరాపల్లి, సెప్టెంబర్ 24, జయ జయహే**

మండలంలో ప్రస్తుత తుఫాను కారణంగా గత మూడు రోజులుగా వరుసగా వర్షాలు పడడం వలన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి ఎల్ వై కాంతమ్మ సూచనలు ఇచ్చారు. రైవాడ రిజర్వాయర్ లో 80 శాతం నీరు ఉండడం వలన ఇప్పటి వరకు 85 శాతం ఉడుపులు అయిపోవడం జరిగింది. ఆలా ఉడుపులైన గ్రామాల్లో రైతులు పొలాల్లో నీరు ఆగకుండా నీరు బయటకు వెళ్లే పోయేటట్టు దారులు చేసుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, చెరువుల్లోకి నీరు మళ్లించే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.అదే విధంగా కొన్ని మెట్టు గ్రామాలు అయినా గరిసింగి, ఏ.కొత్తపల్లి, ముసిడిపల్లి, వాకపల్లి, సీతంపేట, ఇలాంటి గ్రామాల్లో వరి నార్లు ముదిరిపోయి కొన్ని చోట్ల ఇప్పుడు దమ్ములు పట్టి ఉడుపులు ఉడవడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. అటువంటి రైతులు ఇప్పటికే రెండు నెలల నుండి మూడు నెలల వయసున్న నారుని నాటడానికి ప్రయత్నిస్తున్నాం. కచ్చితంగా రైతులు రెండు చిన్న పద్ధతులని అవలంబించాలని అన్నారు. ముదురు నారు యొక్క కొసలు తుంచేసుకోవాలి, ఉడిచే ముందు దగ్గర దగ్గర ఉడిసుకోవాలని,10 సెంటీమీటర్లకి ఒక మొల పడేటట్టు దగ్గర దగ్గర గా ఉడుపు చేసుకోవాలని రైతులకు సూచనలు ఇచ్చారు. గురువారం ముసిడపల్లి గ్రామంలో నాట్లు వేస్తున్న పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఆమె వెంట వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్ కుమార్ ఉన్నారు.

### పూలుగూడలో భారీ వర్షానికి

# ఇళ్లలోకి నీరు గిరిజన కుటుంబాలు ఇబ్బందులు

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 24 జయ జయహే.**

మండలం లోని కితలంగి పంచాయతీ పరిధిలోని పూలుగూడ గ్రామంలో గెమ్మెలి. బొజ్జన్న తండ్రి పేరు భీమన్న. గ్రామంలో సుమారుగా 20 కు పైగా ఇళ్లకు గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం తుఫాన్ ప్రభావంతో గిరిజన కుటుంబాల ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.ఇళ్ల మొత్తం బురద నీటితో నిండిపోయి, గోడలకు తేమ పట్టి (చేమ) ఇళ్లు ఉండడానికి వీలు లేకుండా పోయింది. సమగ్రి వంట సామాన్లు. బియ్యం, బట్టలు అన్నీ తడిసి ముద్దయ్యాయి .రాత్రి వేళల్లో చిన్న పిల్లలు, వృద్ధులతో ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారు. ఈ విషయం పై అధికారులు ఐటీడీఏ పీఓ, అల్లూరి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, పూలుగూడ గ్రామంలో నష్టపోయిన ఇళ్లను పరిశీలించి తగిన నష్టపరిహారం అందించాలని, తాత్కాలిక సహాయ



చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. కె రామ్మూర్తిజనసేన పార్టీ అధ్యక్షులు, కితలంగి పంచాయతీ, జి రాములు కితలంగి పంచాయతీ టిడిపి పార్టీ యూనిట్ ఇంచార్జి తెలపారు,



### తుఫాను వరదలో మునిగిన

# పంట పొలాలు

### తుఫాన్ నష్టం పై ప్రభుత్వ అధికారులు సర్వే చేయాలి

### పంటలు పోయినరైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**టెక్కలి సెప్టెంబర్ 24 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం లో సంతబొమ్మాలి మండలం లో సుమారు 6, వేల ఎకరాలు లోతట్టు పంట భూములు తుఫాను వరదలతో పూర్తిగా మునిగి జలమయ మయ్యా యని సంతబొమ్మాలి జడ్పిటిసి సభ్యులు పాల వసంత రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు గ్రామస్థాయిలో సమగ్ర పంట ల నష్టం సర్వేలు నిర్వహించి నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, ఇదే పరిస్థితులు టెక్కలి నియోజకవర్గం పరిధిలో ఉన్నాయని వసంత రెడ్డి అన్నారు. వరద నీళ్లు వెళ్లే మార్గం లేక పంటలు మునిగిపోయి పాడైపోతా యని ఇలాంటి ముంపు సమస్యలు పునరావృతం కాకుండా నీటిపారుదల సదుపాయాలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగం కల్పించాలని వసంత రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.



## రైలు ప్రమాద కుటుంబాలను ఆదుకోవాలి

### శ్రీకాకుళం జిల్లా శాఖ సిపిఎం డిమాండ్

**టెక్కలి సెప్టెంబర్ 24 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం సమీపమున ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన ఆదివాసి విద్యార్థులు దిలీప్ కుమార్, విశాఖ రావు, శరత్, శివ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని శ్రీకాకుళం జిల్లా సిపిఎం కార్యదర్శి డి గోవిందరావు, ప్రతినిధులు నంబూరు షణ్ముఖరావు, హెచ్ ఈశ్వరరావు, బాగా ది వాసుదేవరావు లు డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను డమర గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి సిపిఎం ప్రతినిధులు ఓదార్చారు, మృత్యువాత పడ్డ కుటుంబాలకు 50 లక్షలు రూపాయలు, అందజేసి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదం నుండి బయటపడిన సాల్మన్ రాజుకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.



### ఆదివాసి విద్యార్థుల మృతి పట్ల

# నిర్లక్ష్యం తగదు

### వసతి గృహం వార్డెన్ ను సస్పెండ్ చేయాలి

### ఆదివాసి దళిత ప్రజా సంఘాల డిమాండ్

**టెక్కలి సెప్టెంబర్ 24 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి రైలు ప్రమాదంలో మృత్యువాత పడ్డ ఆదివాసి విద్యార్థుల పట్ల ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి తగదని వసతి గృహం వార్డెన్ సుదర్శన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని, విద్యార్థుల కుటుంబాలను 25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆదివాసి దళిత ప్రజా సంఘాల సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. టెక్కలి ట్రైబల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వద్ద ధర్నా నిర్వహించారు, వసతి గృహం లో చదువుతున్న ఆదివాసి విద్యార్థులు దిలీప్ కుమార్, గంగువాడ విశాఖ రావు, జ న్నీ శరత్ కుమార్, సవర శివ మృతి చెందడం తీవ్ర విషాదా ని గురి చేసిందని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి విద్యార్థుల పట్ల భద్రత, బాధ్యత నిర్వాహకణ లు లేకుండా నిర్లక్ష్య వైఖరితో సంబంధిత అధికారులు విధులు నిర్వహిస్తున్నారని గతంలో వసతి గృహాల్లో జరిగిన సంఘటనలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, నలుగురు ఆదివాసి విద్యార్థుల మృతికి హాస్టల్ వార్డెన్ తో పాటు ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పిఓ ల నిర్లక్ష్యం, జిల్లా కలెక్టర్ నిర్లక్ష్య వైఖరులు ఉన్నాయని ఉన్నతాధికారులపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తికి రెండేసి ఉద్యోగ బాధ్యతలు అప్పగించడం భావ్యం కాదని ఇది ఆదివాసి విద్యార్థుల విద్య పట్ల నిర్లక్ష్యానికి దారితీస్తుందని జరిగిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు.

## జాతీయ రహదారిపై
# కొండచరియలు విరిగిపడ్డాయి

### మట్టి, రాళ్లను తొలగించే పనులు ప్రారంభం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 25,**



కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కేడి పేట - కొయ్యూరు మధ్య జాతీయ రహదారి పై బుధవారం కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వర్షాల కారణంగా కొండపై నుండి పెద్ద మొత్తంలో మట్టి, రాళ్లు ఒక్కసారిగా రహదారిపై పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారి పూర్తిగా బ్లాక్ అయింది.సమాచారం అందుకున్న వెంటనే జ× శ్రీనివాసరావు, ా× కిషోర్ వర్మ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంటనే జేసీబీ ని రప్పించి రహదారిపై పడిన మట్టి, రాళ్లను తొలగించే పనులు ప్రారంభించారు.అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదు. వాహనదారులు, ప్రయాణికులు రహదారి క్లియర్ అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటించాలని, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. రాకపోకలను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయి.



## ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగుదాటుతున్న గిరిజనులు

**అనంతగిరి: సెప్టెంబర్ 24 జయ జయహే.**

తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతగిరి మండలం ఓనుకొండ గ్రామానికి వెళ్లే మార్గంలో శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గ్రామానికి రాకపోకలు సాగించేందుకు గిరిజనులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో ప్రతి ఏడాది ఇదే సమస్య ఎదురవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా బయటకు వెళ్లాలంటే వాగు దాటాల్సి వస్తోందని చెబుతున్నారు. ఓనుకొండ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు, వాగు దాటేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. "ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటుతున్న ఓనుకొండ గ్రామస్తులు."

# ఆయుధాలతో కాదు...
# ఆలోచనలతోనే శాశ్వత శాంతి

**సి.హెచ్. ప్రతాప్**



ప్రపంచం శాంతిని కోరుకుంటోంది. కానీ ఆయుధాల కోసం వెచ్చించే సంపద మాత్రం ఏటా పెరుగుతోంది. ఒకవైపు శాంతి చర్చలు జరుగుతుంటే, మరోవైపు యుద్ధ సామగ్రి తయారీ వేగం పుంజుకుంటోంది. సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించడం, కాల్పుల విరమణ ఒప్పందాలు కుదుర్చుకోవడం, దేశాల మధ్య మధ్యవర్తిత్వం జరపడం ఘ-ర్షణలను తాత్కాలికంగా నిలువరించవచ్చు. అయితే మనుషుల మనసుల్లో పేరుకుపోయిన ద్వేషం, అపనమ్మకం, ప్రతీకార భావనలను తొలగించకుండా శాశ్వత శాంతిని నెలకొల్పడం సాధ్యం కాదు. యుద్ధం ముందుగా రణ-రంగంలో కాదు---మనిషి ఆలోచనలో పుడుతుంది. అందువల్ల శాంతి నిర్మాణం కూడా అక్కడి నుంచే మొదలవాలి.

ఒక యుద్ధంలో ఎవరు గెలిచారన్నది చరిత్ర నమోదు చేయవచ్చు. కానీ దానివల్ల ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు, భవిష్యత్తును కోల్పోయిన చిన్నారులు, నిరాశ్రయులైన ప్రజలు అనుభవించే వేదనను ఏ విజయమూ పూడ్చలేదు. బాంబులు నగరాలను ధ్వంసం చేస్తాయి; ద్వేషపూరిత భావాలు తరాలను నాశనం చేస్తాయి. యుద్ధం ముగిసిన తరువాత భవనాలను తిరిగి నిర్మించవచ్చు. కానీ సమాజాల మధ్య కూలిపోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించడం అత్యంత కష్టం.

అందుకే విద్యావ్యవస్థలో శాంతి, సహనం, మానవత, పరస్పర గౌరవం వంటి విలువలకు సముచిత స్థానం కల్పించాలి. విద్యార్థులకు చరిత్రలో జరిగిన యుద్ధాలను మాత్రమే బోధించడం కాకుండా, వాటికి దారితీసిన పరిస్థితులు, ప్రజలు చెల్లించిన మూల్యం, చర్చల ద్వారా నివారించగలిగిన అవకాశాలను కూడా వివరించాలి. మతం, భాష, జాతి, ప్రాంతం పేరుతో మనుషులను విభజించే భావజాలానికి వ్యతిరేకంగా బాల్యం నుంచే వివేచనను పెంపొందించాలి.

సాంస్కృతిక మార్పిడి, విద్యార్థుల పరస్పర సందర్శనలు, కళా--సాహిత్య కార్యక్రమాలు దేశాల మధ్య కనిపించని వారధులను నిర్మిస్తాయి. ఒకరి జీవన విధానాన్ని మరొకరు తెలుసుకున్నప్పుడు అపోహలు తొలగుతాయి. సంభాషణ బలహీనతకు సంకేతం కాదు. ఎదుటివారి అభిప్రాయంతో ఏకీభవించకపోయినా దానిని వినగలగడం నాగరికతకు నిదర్శనం. సమస్యను శత్రుత్వంగా కాకుండా పరిష్కరించాల్సిన సవాలుగా చూడగలిగితే ఘర్షణలకు అవకాశం తగ్గుతుంది.

శాంతి అంటే కేవలం తుపాకులు మౌనంగా ఉండటం కాదు. ఆకలి, అన్యాయం, వివక్ష, అవమానం, అవకాశాల లేమి కొనసాగుతున్న సమాజాన్ని శాంతియుత సమాజంగా పరిగణించలేం. ప్రతి మనిషికి న్యాయం, గౌరవం, విద్య, ఉపాధి, భద్రత లభించినప్పుడే శాంతికి బలమైన పునాది ఏర్పడుతుంది. అసమానతలు పెరిగిన నేలపై అసంతృప్తి మొలుస్తుంది; న్యాయం నిలిచిన నేలపై సహకారం వికసిస్తుంది.

ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకోవచ్చు; సైన్యాలు యుద్ధాన్ని నిలిపివేయవచ్చు. కానీ శాంతిని నిలబెట్టగల శక్తి ప్రజల ఆలోచనల్లోనే ఉంటుంది. ద్వేషానికి బదులు సహాన-ుభూతిని, ప్రతీకారానికి బదులు సంభాషణను, ఆధిపత్యానికి బదులు సహకారాన్ని ఎంచుకోవాలి. ఆయుధాలు యుద్ధాన్ని గెలిపించవచ్చు---కానీ మానవత్వంతో నిండిన ఆలోచనలే ప్రపంచానికి శాశ్వత శాంతిని అందించగలవు.

## కోట సత్తెమ్మ ఆలయ ప్రాంగణంలోకి చేరిన వర్షపు నీరు

### నీటిని తొలగిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోకి రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు సూచనల మేరకు నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో నిలిచిన నీటిని ట్రాక్టర్ ద్వారా తొలగించే చర్యలు చేపట్టారు.అలాగే నిడదవోలు పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటమునిగిన పలు ప్రాంతాల్లో కొమ్మిన వెంకటేశ్వరరావు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేశారు.



# నీరు ఉంటేనే.. భవిష్యత్

**సి.హెచ్.ప్రతాప్**

నీరు లేకపోతే నగరాలు ఆగిపోతాయి.. పంటలు ఎండిపోతాయి.. పరిశ్రమలు నిలిచిపోతాయి. అభివృద్ధి ఎంత వేగంగా సాగినా, దాని పునాది నీరే. అందుకే నీటి సంక్షోభం ఇక పర్యావరణ సమస్య మాత్రమే కాదు---ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, ప్రజారోగ్యం, భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన ప్రశ్న.

ఈ కీలక అంశంపై దృష్టి సారిస్తూ 9వ ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్--2026 సెప్టెంబర్ 22 నుంచి 26 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతోంది. "క్లైమేట్ రెసిలియెంట్ వాటర్ మేనేజ్‌మెంట్" ప్రధాన ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సుమారు 150 దేశాలను ఆహ్వానించారు.

భారత్‌లో నీటి లభ్యతపై గణాంకాలు పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర జల సంఘం ాాంంవంంఎవత్ శీట ఝ్వతీ =వంశీబతీఎవం శీట ×అఇఖు--2024 ప్రకారం దేశంలో సగటు వార్షిక నీటి లభ్యత సుమారు 2,115.95 బిలియన్ ఘన మీటర్లు (దీజవీ). అయితే వినియోగించుకోగల నీటి పరిమాణం సుమారు 1,137 దీజవీ మాత్రమే. దేశ నీటి అవసరం 2025లో 843 దీజవీ, 2050 నాటికి 1,180 దీజవీకు చేరుతుందని అంచనా.

తలసరి నీటి లభ్యత కూడా తగ్గుతోంది. 2021లో 1,573 ఘన మీటర్లుగా ఉన్నది, 2031 నాటికి 1,446 ఘన మీటర్లకు తగ్గే అవకాశం ఉంది.

భూగర్భజలాల పరిస్థితి కూడా కీలకమే. 2025 అంచనాల ప్రకారం వార్షిక భూగర్భజల రీచార్జ్ 448.52 దీజవీ, వెలికితీయగల వనరులు 407.75 దీజవీ, వార్షిక వెలికితీత 247.22 దీజవీగా నమోదైంది.

ఇప్పటికే గ్రామీణ తాగునీటి ప్రాప్యతలో పురోగతి కనిపిస్తోంది. 2026 మార్చి 3 నాటికి 19.36 కోట్ల గ్రామీణ కుటుంబాల్లో 15.82 కోట్ల (81.71%) ఇళ్లకు కుళాయి నీటి సరఫరా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది.

అయితే కుళాయి పెట్టడం ఒక్కటే నీటి భద్రత కాదు. నీటి వనరులను కాపాడటం, వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భజలాలను పునరుద్ధరించడం, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, పట్టణాల్లో వృథాను అరికట్టడం సమాంతరంగా జరగాలి.




నీటి విలువ దాహం వేసినప్పు కాదు.. అది దొరకనప్పుడు తెలుస్తుంది.

ఈరోజు వృథా చేసిన చుక్క.. రేపటి కొరతగా మారుతుంది.

నీటి నిల్వలను పెంచకపోతే.. భవిష్యత్ అభివృద్ధికి అడ్డుకట్ట పడుతుంది.

నీటిని కాపాడటం అంటే నదులను మాత్రమే కాదు---నాగరికతను కాపాడటం.

ప్రతి చుక్కను రక్షిద్దాం.. ప్రతి తరానికి భవిష్యత్‌ను అందిద్దాం.

నీరు ఉంటేనే.. జీవితం.
నీరు ఉంటేనే.. అభివృద్ధి.
నీరు ఉంటేనే.. భవిష్యత్.

## అల్లిపురం వద్ద రహదారిపై
# కూలిన చింతచెట్టు

### కాశీపురం- దేవరాపల్లి మధ్య రాకపోకలు బంద్

### యుద్ధప్రాతిపదికన చెట్టును తొలగించిన ఎస్ఐ వి.సత్యనారాయణ బృందం

**దేవరాపల్లి, సెప్టెంబర్ 24, జయ జయహే**




తుఫాన్ వలన ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దేవరాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లిపురం వద్ద ప్రధాన రహదారిపై గురువారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో భారీ చింతచెట్టు నేలకూలింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడి, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.సమాచారం అందిన వెంటనే దేవరాపల్లి ఎస్ఐ వి.సత్యనారాయణ అప్రమత్తమయ్యారు. తన బృందంతో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ముందుగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు.అనంతరం జేసీబీ ఆపరేటర్ మాధవ్ మరియు కాశీపురానికి చెందిన వుడ్ కట్టర్ చంద్రరావు సహాయంతో యుద్ధప్రాతిపదికన చెట్టును ముక్కలుగా నరికి, జేసీబీ సహాయంతో రోడ్డుపై నుంచి పూర్తిగా తొలగించారు. దాదాపు గంట వ్యవధిలోనే రోడ్డును క్లియర్ చేసి ట్రాఫిక్ ను పునరుద్ధరించడం జరిగింది.ఎస్సై సత్యనారాయణ చూపిన చొరవ, సమయస్ఫూర్తికి వాహనదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పోలీసులు అంటే కేవలం కేసులే కాదు, ఆపద సమయంలో ఆదుకునే నేస్తం అని నిరూపించారని కొనియాడారు.ప్రస్తుత భారీ వర్షాల దృష్ట్యా వాహనదారులు, ప్రజలు అప్రమత్తంగా ప్రయాణించాలని, పాత చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడరాదని, రహదారులపై ఎలాంటి అడ్డంకులు, ప్రమాదాలు ఎదురైనా వెంటనే డయల్ 100, దేవరాపల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్ఐ వి.సత్యనారాయణ కోరారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24, జయ జయహే**

శ్రీకాళహస్తి స్థానిక శ్రీనివాస తేజ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సమిటి వెంకటేష్‌కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తి డీఎస్పీ ఎన్.ఎస్. మూర్తి, బి.ఎన్. కండ్రిగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మీనారాయణ, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఏ.హరి ప్రసాద్ హాజరై తమ చేతుల మీదుగా సమిటి వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో సమిటి వెంకటేష్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించడం పాఠశాలతో పాటు శ్రీకాళహస్తి ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

# వేడుకగా గణపతి హోమం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24, జయ జయహే**



శ్రీకాళహస్తి పట్టణంలోని కుమారస్వామి తిప్ప వద్ద వంకాయల సిద్దులయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమ పూజకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గణపతి హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గణపతి హోమ పూజలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు శ్రీకాళహస్తి ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై వినాయకుడిని దర్శించుకుని హోమ పూజలో పాల్గొన్నారు. సాయంత్రం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, గంగలపూడి హరి రాయల్, బుజ్జి తదితరులతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుఫాను వేల ప్రజలకు వెన్నంటే అండగా జిల్లా పోలీసులు

**అనకాపల్లి జయ జయహే**

తీవ్ర తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై రంగంలోకి దిగింది తుఫాను వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాణాపాయాలు కలగకుండా అత్యవసర సమయాల వెనువెంటనే స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా డీఎస్పీలు సిఐలు ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది క్షేత్రస్థాయిలమ్మర సహాయక చర్యలు చేపట్టారు రిజర్వాయర్లు కాలువలు ప్రధాన రహదారులు నిరంతరం పోలీసులు పర్యవేక్షిస్తున్నారు తుఫాను విపత్తు వేళ ప్రజల ప్రధాన ఆస్తి రక్షణ ప్రథమ కర్తవ్యం గా జిల్లా పోలీస్ శాఖ 24 గంటలు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తుందని లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రయాణాలు చేసే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సహాయం కోసం తక్షణమే 112/100 నెంబర్లు సంప్రదించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు ఎప్పటికప్పుడు జలాశయాలు కాలువలు లోతట్టు ప్రాంతాలు పరిశీలన భద్రత పరిరక్షణ చర్యలు చేపడుతున్నారని ముఖ్యంగా పోలవరం కాలువ కసింకోట అనకాపల్లి డిఎస్పి శ్రీనివాసులు కసింకోట ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు ఎస్సై లక్ష్మణరావు కలిసి పోలవరం కాలువ లీకేజీలను వారు పరిశీలించడం జరిగింది కాలువ లోపల భాగంలో సిమెంట్ ప్లాస్టరింగ్ పనుల నిమిత్తం కాంట్రాక్టర్ తో మాట్లాడి ఆ పనుల వేగంతో చేయడం జరిగింది తాళ్లపాలెం మార్కెట్ వద్ద నిలిచిన వరసకు నీటిని హెవీ డ్యూటీ మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ స్థానికులు



ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టడం జరిగింది అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ లోపట నీరు నిల్వ ఉన్నప్పటికీ బస్సులు రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ ఆర్టీసీ డిఎం తో కలిసి తగిన చర్యలు చేపట్టడం జరిగింది విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిని అనకాపల్లి జీవీఎంసీ సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ పక్క రోడ్డు ద్వారా ట్రాఫిక్కును మళ్లించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవడం జరిగింది జిల్లాలో తాండవ రిజర్వాయర్ రాయివాడ రిజర్వాయర్ ఏలేరు, తాండవ కాలువలు ఇలా పలు ప్రాంతాల్లో గల ప్రధాన రిజర్వాయర్లు కాలువలను ఆయా ప్రాంతాల డిఎస్పీలు సిఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతున్నది ముఖ్యంగా రహదారుల వెంట పెద్ద పెద్ద చెట్లు ఈ గాలి వానలకు పడిపోయిన సంఘటన సబ్బవరం దగ్గర అమృతాపురం నుండి షీలా నగరికి వెళ్లే ప్రధాన రహదారి అలాగే కొత్తకోట మార్కెట్ యార్డ్ వద్ద మర్రిచెట్టు విద్యుత్తు ట్రాన్స్ఫర్ పై పడిపోవడం జరగడంతో విద్యుత్తు నిలిచిపోవడం దేవరపల్లి



వద్ద అల్లిపురం జంక్షన్ ప్రధాన రహదారిపై పడిన చెట్టును తొలగించడం గోల్కొండ వద్ద ఏరియాలో రాకపోకలు అంతరాయం ఏర్పడితే తొలగించిన చెట్లు అచ్యుతాపురం పరవాడ రహదారిపై బ్రాండిక్స్ రోడ్డు చెట్లను తొలగింపు సాలపు వాని పాలెం వద్ద జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ పూడుకపోవడంతో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో జెసిబి తో మట్టిని అడ్డంకులను తొలగించి నీరు సాఫీ వెళ్లేలా చర్యలు తీసుకోవడం జరిగింది పోలీసులు ప్రతి ప్రాంతంలో అప్రమత్తమై చెట్లను రోడ్లపై నుండి తొలగించే ట్రాఫిక్ క్లియర్ కూడా చేయడం జరుగుతున్నది ఈ భారీ వర్షాలకు ఈదురు గాలులకు ప్రజలందరూ బయటికి రావద్దని అత్యవసరం అయితే ఎల్ల నుంచి బయటకు రావద్దని చెట్లు విద్యుత్ స్తంభాలు పాత భవనాల కింద నిలబడవద్దని వాగులు కాజు వేలు ఉధృతంగా ప్రవహించే కాలువలను దాటే ప్రయత్నం చేయరాదని ఎలాంటి అత్యవసర సహాయం కోసం అయినా స్థానిక ఆయా మండల పోలీసులను సంప్రదించాలని వారికి ఫోన్ చేస్తే తక్షణ స్పందించి సహాయము అందించడం జరుగుతుందని అలాగే 100కు ఫోన్ చేసిన పోలీసులు స్పందిస్తారని పోలీసులు పేర్కొన్నారు

## భారీ వర్షాలతో ఈపీడీసీఎల్‌కు రూ.2.51కోట్ల నష్టం

**తుఫాను ప్రభావంతో 8,87,757 విద్యుత్ సర్వీసులు ప్రభావితం**

**యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు**

**ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 24:**



రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లినప్పటికీ, రెండు రోజుల ముందుగానే చేపట్టిన సన్నద్ధత, క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతరాయంగా చేసిన కృషితో విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పెద్ద ఎత్తున విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచే అదనపు సిబ్బంది, వాహనాలు, క్రేన్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, విద్యుత్ స్తంభాలు, పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు తదితరాలను సిద్ధంగా ఉంచి, తుఫాను ప్రభావం ప్రారంభమైన వెంటనే క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు అందిన నివేదిక ప్రకారం...33/11 కేవీ సబ్‌స్టేషన్లు 127 ప్రభావితం కాగా 122 పునరుద్ధరించారు. అదేవిధంగా 33 కేవీ ఫీడర్లు 111 కి నష్టం వాటిల్లగా 99, 33 కేవీ స్తంభాల్లో 17 కి 14, 11 కేవీ ఫీడర్లలో 536 కి 481, 11 కేవీ స్తంభాల్లో 471 కి 218, 15.77 కి.మీ. 11 కేవీ లైన్లలో 7.4 కి.మీ., 20.47 కి.మీ. ఎల్టీ లైన్లలో 11.00 కి.మీ., 461 ఎల్టీ స్తంభాల్లో 218, 195 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లలో 119 పునరుద్ధరించారు. మొత్తం 1,468 గ్రామాలు ప్రభావితం కాగా 1,238 గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. తుఫాను ప్రభావంతో 8,87,757 విద్యుత్ సర్వీసులు ప్రభావితం కాగా, 8,30,679 సర్వీసులకు సరఫరా పునరుద్ధరించారు. ఇందులో 8,37,559 వ్యవసాయేతర సర్వీసుల్లో 7,89,212, వ్యవసాయ సర్వీసుల్లో 50,198 కి 41,467 పునరుద్ధరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం నష్టం రూ.251.33 లక్షలుగా నమోదైంది.ప్రధానంగా శ్రీకాకుళం జిల్లాలో 96 సబ్‌స్టేషన్లు, 33 కేవీ ఫీడర్లు 55, 11 కేవీ ఫీడర్లు 409, 11 కేవీ స్తంభాలు 115, ఎల్టీ స్తంభాలు 149, 27 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 962 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా, పునరుద్ధరణ కోసం 745 మంది సిబ్బంది, 52 వాహనాలు, 22 పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, 35 క్రేన్లు, 400 విద్యుత్ స్తంభాలు, 246 ట్రాన్స్‌ఫార్మర్లు మోహరించారు. విజయనగరం జిల్లాలో 29 సబ్‌స్టేషన్లు, 28 33 కేవీ ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లు 30, 11 కేవీ స్తంభాలు 47, ఎల్టీ స్తంభాలు 52, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 31 దెబ్బతిన్నాయి. 338 గ్రామాలు ప్రభావితం కాగా 297 గ్రామాల్లో సరఫరా పునరుద్ధరించారు. జిల్లాలో 4,95,983 వ్యవసాయేతర సర్వీసులు ప్రభావితం కాగా 4,58,511, వ్యవసాయ సర్వీసులు 44,320 ప్రభావితం కాగా 35,948 పునరుద్ధరించారు. విజయనగరం జిల్లాలో ప్రాథమిక నష్టం రూ.35.04 లక్షలుగా అంచనా వేశారు. సీఎండీ ఆదేశాల మేరకు కార్యకలాపాల డైరెక్టర్ టి.వి. సూర్యప్రకాశ్, సీజీఎం లు పి. సాల్మన్ రాజు, ఎల్. మహేంద్రనాథ్, ఎస్. రాజబాబు, జి. శ్యాంబాబు, జనరల్ మేనేజర్లు, ఎస్‌ఈలు, ఇతర ఉన్నతాధికారులు ప్రభావిత జిల్లాలకు చేరుకుని క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, అవసరమైన సిబ్బది, వాహనాలు, యంత్రాలు, సామగ్రిని సమన్వయం చేస్తున్నారు. కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లాల వారీగా నష్టం, పునరుద్ధరణ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, పునరుద్ధరణలో వెనుకబడిన ప్రాంతాలకు అదనపు వనరులను తరలిస్తున్నారు. మిగిలి ఉన్న సాధారణ విద్యుత్ అంతరాయాలను గురువారం నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను సీఎండీ ఆదేశించారు. వ్యవసాయ సర్వీసుల పునరుద్ధరణను కూడా త్వరితగతిన చేపడుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో పొలాలు, విద్యుత్ మౌలిక వసతుల వద్ద నీరు నిలిచి ఉండటంతో భద్రతా కారణాల వల్ల పనులు చేపట్టడం సాధ్యం కాని పరిస్థితి ఉంది. నీరు తగ్గిన వెంటనే ఆయా ప్రాంతాల్లో కూడా పునరుద్ధరణ పనులను పూర్తి చేయనున్నారు.

"ప్రజలకు విద్యుత్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు, సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తారు. మిగిలిన పనులను కూడా అత్యంత వేగంగా పూర్తి చేసి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకువస్తాం" అని సీఎండీ స్పష్టం చేసారు.ప్రజలు తెగిపోయిన విద్యుత్ వైర్లు, నేలకొరిగిన స్తంభాలను తాకకుండా అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ ప్రమాదాలను వెంటనే 1912కు తెలియజేయాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912, కార్పొరేట్ కార్యాలయం 8331018762, విశాఖపట్నం జోన్--1 -- 9490610019, జోన్--2 -- 9849628880, జోన్--3 -- 9491030722, శ్రీకాకుళం -- 9701400865, విజయనగరం -- 9490610102 నంబర్లకు తెలియచేయవచ్చని పేర్కొన్నారు.

## ఎడతెరిపి లేని వానలు.. స్థంభించిన జనజీవనం

**వాణిజ్య దుకాణాలు మూసివేత**

**దేవరాపల్లిలో ఇప్పటివరకు 8 సెంటీమీటర్లు వర్షపాతం నమోదు**

**రైవాడ రిజర్వాయర్ కు ఊరట..భారీ వర్షాలతో పెరుగుతున్న నీటిమట్టం**

**దేవరాపల్లి, సెప్టెంబర్ 24, జయ జయహే**



వాయుగుండం ప్రభావంతో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. వాణిజ్య దుకాణాల సైతం మూతపడ్డాయి. దేవరాపల్లిలో ఇప్పటివరకు 8 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన రైవాడ రిజర్వాయర్ కు కొంత ఊరట దక్కింది. దీంతో స్వల్పంగా జలాశయం నీటిమట్టం పెరిగింది. అత్యధిక నీటిమట్టం 114 మీటర్ల కాగా ప్రస్తుతం 104 మీటర్ల వద్ద నమోదయింది.గత కొద్ది రోజులుగా తీవ్ర ప్రభా వం చూపిన ఎల్ నినో పరిస్థితులవల్ల విశాఖ నగర తాగునీటి అవసరాలు, ఆయకట్టుకు సాగునీరు తీర్చే రైవాడ రిజర్వాయర్లోనీటిమట్టం గణనీయంగా పడిపోయింది. నీటి నిల్వలు అడుగంటడంతో అటు ఆయకట్టు రైతులు, ఇటు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతంబంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం నగరవాసులకు, అధికారులకు ఊరటనిచ్చింది. గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలకారణంగా రైవాడ రిజర్వాయర్ లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. . చుట్టుపక్కల కొండ ప్రాంతాల నుంచి క్యాచ్మెంట్ ఛానల్స్ ద్వారా వర్షపు నీరు రిజర్వాయర్ లోకి ప్రవహిస్తోంది. దీంతో రిజర్వాయర్లో నీటి శాతం వేగంగా పెరుగుతోంది. నీ టిమట్టం గణనీయంగా పుంజుకోవడంతో సాధారణ స్థితికి చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ వర్షాలు రిజర్వాయర్ కు ప్రాణం పోశాయని, తాగునీటి, సాగునీటి సరఫరాపై ఉన్న ఆందోళనలు తాత్కాలికంగా తొలగిపోయని ఈ ప్రాంత ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మండల ప్రత్యేక అధికారిగా మంజులవాణి నియామకం

**మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి శ్రేణులు**

**దేవరాపల్లి, సెప్టెంబర్ 24, జయ జయహే**

ఎంపీపీ, జడ్పిటిసిల పాలన ముగియడంతో మండల ప్రత్యేక అధికారిగా డిపివో ఎస్.మంజులవాణి నియమితులయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన మంజులవాణిని ఎంపీడీవో ప్రసాద్, పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించారు. వీరితో పాటు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, సీనియర్ టిడిపి నాయకులు సోమిరెడ్డి గోవింద, మండల తెలుగు యువత అధ్యక్షులు చిటిమిరెడ్డి నాయుడు, దేవరాపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు గుల్లి పల్లి అర్జునరావు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు మొసలి పైడిరాజు, మాజీ ఎంపీటీసీ గొరపల్లి భాస్కరరావు, అల్లు శ్రీనివాసరావు, కర్రీ దేవుళ్ళు తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి వినాయక చిత్రపటాన్ని బహుకరించారు



## రైల్వేకోడూరులో 28న జాబ్‌మేళా

**తిరుపతి, సెప్టెంబర్ 24, జయ జయహే**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 28న రైల్వేకోడూరులో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఏపీఎస్ఎస్‌డీసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేకోడూరు సాయినగర్‌లోని శ్రీ సాయి డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 8.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. 12 ప్రముఖ బహుళజాతి సంస్థలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవడంతో పాటు స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఎల్‌డీఎం జి. రవికుమార్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగులు దరఖాస్తులను నిర్ధారించండి

**మాడుగుల సెప్టెంబర్ 24 జయ జయహే**

ఇటీవల ప్రభుత్వం కొత్త పెన్షన్ ల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. వాటిలో వికలాంగుల సర్టిఫికెట్లతో పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన దరఖాస్తులను మరొకసారి పరిశీలించి నిర్ధారణ చేయాలని స్థానిక ఎండిఓ కే అప్పారావు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను ఆదేశించారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 21న జరిగిన మండల సమావేశంలో మాజీ ఎంపీపీ ధర్మజా కొందరు వ్యక్తులు నకిలీ వికలాంగుల సర్టిఫికెట్లతో పెన్షన్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇప్పటికే వికలాంగుల పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించి వారి దరఖాస్తులను పరిశీలించారు. దానిలో భాగంగా గురువారం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమై వికలాంగుల పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మరొకసారి క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన అర్హులనే గుర్తించాలని సూచించారు. చిన్న చిన్న సాకులతో కూడా వికలాంగుల పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అలాంటివారిని తొలగించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో వికలాంగుల దరఖాస్తులు పరిశీలన జరుగుతుందని తెలిపారు.

## మండల ప్రత్యేక అధికారిగా రవీంద్ర బాబు

**మాడుగుల, సెప్టెంబర్ 24,జయ జయ హే**



మాడుగుల ఎంపీపీ రాజారాం పదవీకాలం ఈ నెల 23 తో ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో వి రవీంద్రబాబు ను మండల ప్రత్యేక అధికారిగా నియమిస్తూ .ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు ఎండీఓ కే అప్పారావు గురువారం తెలిపారు.ఈయన చోడవరం వ్యవసాయ శాఖ ఏ డి గా పనిచేస్తున్నారు.మరలా ఎన్నికలు జరిగే.వరకు రవీంద్ర బాబు మండల ప్రత్యేకాధికారి గా మాడుగులలో బాధ్యతలు నిర్వహిస్తారనీ తెలిపారు



## తాతయ్య నాయుడు సేవా స్ఫూర్తికి ఏయూ ఫిదా

**ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారి అవార్డు అందజేత**

**స్పేసెస్ కళాశాల అధ్యాపకుడు జి. తాతయ్య నాయుడుకు అరుదైన గౌరవం**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 24, జయ జయహే**

విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ సమాజ సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు స్పేసెస్ డిగ్రీ కళాశాల వాణిజ్య, నిర్వహణ విభాగ అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి, అనకాపల్లి జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి జి. తాతయ్య నాయుడుకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి అవార్డు లభించింది. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల కోదండరామయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం. సుధాకర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పులిపాటి కింగ్ చేతుల మీదుగా జి. తాతయ్య నాయుడు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థులను సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా భాగస్వాములను చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన ప్రదర్శనలు, పర్యావరణ పరిరక్షణ, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ఆయన విశేష కృషి చేశారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.ఆర్.కె. రెడ్డితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు జి. తాతయ్య నాయుడును అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాయిలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారిగా అవార్డు పొందడం స్పేసెస్ డిగ్రీ కళాశాలతో పాటు శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలకు గర్వకారణమని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## మాజీ ఎంపీపీ మాటలు హాస్యాస్పదం

**మాడుగుల సెప్టెంబర్ 24 జయ జయహే**



ఈ నెల 21 న జరిగిన మండల సమావేశంలో మాజీ ఎంపీపీ వేమవరపు రామదర్మజ మాట్లాడిన మాటలు హస్యపాదంగా ఉన్నాయని జనసేన ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ చాలా మంది సదరం ఫెక్ సర్టిఫికెట్ చేయించుకొని పెన్షన్లు పొందుతున్నారని అనడంలో అర్థం లేదన్నారు. మీటింగులో మాట్లాడిన మాటలు ఏవైతే ఉన్నాయో అవి గతం మరిచి మాట్లాడుతున్నారన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తో పాటు ప్రజలు అందరూ నిజ నిజాలు తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో 2023 లో డిశంబర్ నుండి కూడా కొత్త పెన్షన్లు నిలిపి వేశారన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పుడు మాత్రమే వికలాంగుల పెన్షన్లకు దరఖాస్తులు పెట్టుకున్నారనీ, ఇది వరకు వికలాంగుల పెన్షన్లు అనేవి మీ ప్రభుత్వంలో మంజూరు చేసినవి కాబట్టి, మీరు మీ ప్రభుత్వం వారు డబ్బులు దండుకొని ఫెక్ సర్టిఫికెట్ ఇచ్చి పెన్షన్లు మంజూరు చేసారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. తప్పులు మీరు చేసి పక్కవారి మీద నిందలు వేయడం అనేది సరికాదనీ, కూటమి ప్రభుత్వంలో మీలాగా ఫెక్ సర్టిఫికెట్ ఇచ్చి పెన్షన్ ఇవ్వడం అనేది జరగని పని అని తెలుసుకోవాలన్నారు.

# యుద్ధప్రాతిపదికన తుఫాన్ సహాయక చర్యల్లో పోలీసులు





## జలమయ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ

### వరహాల గెడ్డ నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించిన జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

**పార్వతీపురం జయజయహే**

పార్వతీపురం పట్టణ పరిధిలో వరహాల గెడ్డలో పెరిగిన నీటి ప్రవాహ ఉధృతిని, పరిసర ప్రాంతాల్లో నెలకొన్న జలమయ పరిస్థితులను జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డిస్వయంగా పరిశీలించారు. అర్నాబ్ తుఫాన్ ప్రభావం వలన రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు, వరద నీటి కారణంగా నీటి ప్రవాహం పెరిగిన వరహాల గెడ్డను స్వయంగా పరిశీలించి, నీటి ప్రవాహానికి అడ్డుగా వున్నా అడ్డంకులను(గుర్రపు డెక్క)ను తొలిగించి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా జలమయమైన ప్రాంతాలను పరిశీలించి ఎస్పీ గారు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే స్పందించేలా పోలీస్ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. మీడియాతో మాట్లతుడూ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వుంటూ నిరంతరం సేవలు అందిస్తున్నారని, క్షేత్ర స్థాయిలో పోలీస్ అధికారులు , సిబ్బంది అందుబాటులో ఉంటూ వర్షాల,గాలుల కారణంగా జిల్లా లో రహదారిపై చెట్లు విరిగిపడిన చోట తక్షణమే స్పందించి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని యుద్ధప్రాతిపదికన అవసరమైన సామగ్రితో చెట్లను తొలగించి రోడ్డును క్లియర్ చేస్తున్నారని, నీరు పొంగి ప్రవహిస్తున్న రహదారుల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేసి ప్రజలు వాగులు దాటకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు . ప్రస్తుత వర్షాల దృష్ట్యా వాహనదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ,ప్రమాదాలు జరిగినా అంతరాయాలు ఏర్పడినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు . అత్యవసరమైతే తప్ప మిగతా ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# గంజాయి కేసుల్లో కఠిన చర్యలు

## ఒకరిపై పీడీ యాక్ట్.. ఇద్దరికి ఏడాది జైలు

**విజయనగరం జయజయహే**

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. భోగాపురం మండలం రెడ్డికంచేరుకు చెందిన గాబు దుర్గారావు (37)పై పీడీ యాక్ట్ ప్రయోగించి విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించినట్లు వెల్లడించారు. అతడిపై మూడు గంజాయి, రెండు కొట్లాట కేసులు ఉండటంతో పాటు విజయనగరం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని తెలిపారు. మరో కేసులో 2019లో ఎస్.కోట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 15 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేరళకు చెందిన యేసుదాసు బిజోమాన్ (36), దీపు కుత్తప్పన్‌లకు విజయనగరం 1వ ఎడిజే కమ్ స్పెషల్ జడ్జి, ఎన్డిపీఏస్ కోర్టు ఏడాది కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 11 గంజాయి కేసుల్లో 28 మంది నిందితులకు శిక్షలు పడినట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, సాక్ష్యాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## గురువులపై దాడి చేసిన

# గొడ్డలి గూండాలను అరెస్టు చేయాలి

### రెడ్డి నారాయణరావు

**విశాఖపట్నం:**



విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులపై భౌతిక దాడులకు పాల్పడటం, వారిని దూషించడం, బెదిరించడం వంటి చర్యలను ఎంతమాత్రం సమర్థించలేమని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు అన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి, రాత్రింబవళు చదివి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నియామక ప్రక్రియపై సందేహాలు ఉంటే సంబంధిత ఆధారాలతో చట్టపరమైన మార్గాలను అను-సరించాలి తప్ప ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. తల్లిదండ్రుల తర్వాత సమాజంలో గురువుకు అత్యంత గౌరవప్రదమైన స్థానం ఉందని, గురువులను గౌరవించడం తెలుగు సంస్కృతి, సంప్రదాయంలో భాగమన్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తూ భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. డీఎస్సీ నియామకాలపై వివిధ రాజకీయ వర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఉపాధ్యాయులపై భౌతిక దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనవసరమైన ఆరోపణలు, దుష్ప్రచారాలకు స్వస్తి పలికి, విద్యా వ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు అన్ని వర్గాలు బాధ్యతగా వ్యవహరించాలని రెడ్డి నారాయణరావు కోరారు.



# వర్షాలకు కూలిన ఇళ్లు

**మాడుగుల సెప్టెంబరు 24 జయ జయహే**

మాడుగుల పెద్ద కోమటి పేటలో నివాసం ఉంటున్న కూరా కన్నయ్య శెట్టికి చెందిన పెంకుటిల్లు వర్షాలకు గురువారం కూలిపోయిందనీ, కన్నయ్య శెట్టి కుమార్తె దంగేటి రత్నావతి తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు.

# కక్షిదారులు ఆదివారం చలానా తీసుకోండి

### సబ్ రిజిస్ట్రార్ గీత లక్ష్మి

**చోడవరం సెప్టెంబరు 24 జయ జయహే**



బ్యాంకు ఉద్యోగులు సమ్మె నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కక్షిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి గురువారం తెలిపారు. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకునే కక్షీ దారులు తమకు కావలసిన చలానాలను ఈనెల 27 ఆదివారం బ్యాంకుల ద్వారా ముందుగా తీసుకోవచ్చున్నారు. ఈనెల 28 నుంచి బ్యాంకులు సమ్మె నేపథ్యంలో రిజిస్ట్రేషన్ లకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాబట్టి సంబంధిత కక్షీ దారులు గమనించాలన్నారు



## భారీ వర్షాల నేపథ్యంలో

# ఫోన్ ద్వారా పీజీఆర్ఎస్

### 25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

**పాడేరు, సెప్టెంబర్ 24: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శుక్రవారం, సెప్టెంబర్ 25, న నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఫోన్ ద్వారా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా, తమ సమస్యలు ఫిర్యాదులను ఫోన్ ద్వారా తెలియజేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ ఫోన్ ద్వారా నిర్వహించే పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఐఏఎస్, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ,, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ప్రజలు ఈ కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేయవచ్చు

ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను క్రింది ఫోన్ నంబర్లకు కాల్ చేసి తెలియజేయవచ్చు:

- 📞 92818 56953
- 📞 92818 56954
- 📞 94418 42177

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కార్యాలయాలకు ప్రత్యక్షంగా రావాల్సిన అవసరం లేకుండా ఫోన్ ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

## పోలవరం ఎడమ కాలువను

# సందర్శించిన గోవింద సత్యనారాయణ

**అనకాపల్లి జయ జయహే**



ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా అనకాపల్లి నియోజకవర్గ కసింకోట మండలం తాళ్లపాలెం గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన పోలవరం ఎడమ ప్రధాన కాలువకు ఇరువైపులా లీకేజీలు ఏర్పడి నీరు పోతున్న విషయాన్ని గమనించిన స్థానిక నాయకులు గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పేలా గోవింద సత్యనారాయణ ఈ సమాచారం తెలుసుకుని తాళ్లపాలెం పోలవరం ఎడమ కాలువ కాల్వ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించి గతంలో హుదూద్ తుఫాను సమయంలో ఇదే కాలం వద్ద నీటి ప్రవాహానికి 8 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన అధికారులకు గుర్తు చేశారు ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా తక్షణమే గట్టులను పటిష్టం చేసి రోలింగ్ కంపాక్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కె ఫోను ద్వారా పరిస్థితిని తీవ్రతను ఆయన వివరించడం జరిగింది . మంత్రి స్పందించి వెంటనే రాష్ట్ర ఇంజనీరింగ్ ఈ ఎన్ సి అధికారులను అప్రమత్తం చేయడం జరిగింది వారు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ డి ఈ పోలవరం కాలువ ఈ ఇ, జేఈ మరి సంబంధిత శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి వాటర్ ఇంజన్ల సాయంతో లీకేజీ నీటిని పైపుల ద్వారా తిరిగి కాలువలకు మళ్ళించడం జరిగింది అలాగే అక్కడ ఉన్న మామిడివాడ గడ్డ కాలువను తక్షణమే శుభ్రం చేసి నీరు సాఫీగా వెళ్లే ఏర్పాటు చేయాలని లేనియెడల ఆ ప్రాంత ప్రజలు ముంపునకు గురి అయ్యే ప్రమాదం ఉందని అధికారులకు హెచ్చరించడం జరిగింది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే తనకు లేదా అధికారులకు సమాచారం అందించాలని మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ సూచించారు



## ముంపు ప్రాంతాలను

# పరిశీలించిన ఎండిఓ

**మాడుగుల సెప్టెంబర్ 24 జయ జయ హే**

కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో మాడుగుల మండలంలో గల ముంపు ప్రాంతాలను ఎండిఓ కే అప్పారావు గురువారం సందర్శించి పరిశీలించారు. ముంపుకు గురవుతున్న పొలాలను కూడా పరిశీలించి నీరు పోయేందుకు అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని ఉపాధి శ్రామికులను ఆదేశించారు. అలాగే నది పరివాహక ప్రాంతాలను పెద్దేరు జలాశయాన్ని పరిశీలించి జలాశయంలో చేరుతున్న నీటిని ఆ ప్రాంత పరిస్థితిని పరిశీలించారు. వర్షాలు నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధులు వంటి వారు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు అలాగే రైతులు తమ పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని విద్యుత్ స్తంభాల వైపు ఎవరు వెళ్ళవద్దని సూచించారు.

# అఘాయిత్యం

## పోలీసులమంటూ బెదిరించి బాలికపై అఘాయిత్యం

## దేశరాజధానిలో మరొక దారుణం

(హెచ్.ప్రతాప్)

దేశ రాజధాని ఢిల్లీలో మైనర్ బాలికపై జరిగిన మరో దారుణ లైంగిక దాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. కల్కాజీ ప్రాంతంలోని ఆస్థా కుంజ్ పార్కులో 17 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు పోలీసులుగా నటిస్తూ బెదిరించి సామూహిక లైంగిక దాడికి పాల్పడినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 21 సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. తాజా పోలీసు సమాచారం ప్రకారం ముగ్గురు నిందితులనూ మరుసటి రోజు ఉదయం అదుపులోకి తీసుకున్నారు.



పోలీసుల వివరాల ప్రకారం బాధిత బాలిక తన 17 ఏళ్ల స్నేహితుడితో కలిసి సాయంత్రం కల్కాజీ ఆలయానికి వెళ్లింది. దర్శనం అనంతరం సుమారు 7.30 గంటలకు సమీపంలోని పార్కుకు వెళ్లారు. అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి ఇద్దరి వయసులు, అక్కడికి వచ్చిన కారణం గురించి ప్రశ్నించారు. పోలీసు చర్య తీసుకుంటామని, కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికను స్నేహితుడి నుంచి వేరుచేసి పార్కులోని నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రాత్రి 8.45 గంటలకు పోలీసు నియంత్రణ గదికి సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఎయిమ్స్‌కు తరలించారు. ఆమె వాంగ్మూలం ఆధారంగా 18 ఏళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారం, నేరపూరిత కుట్ర, తీవ్ర గాయం కలిగించడం, బెదిరింపులకు సంబంధించిన నిబంధనలతోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. అమర్ కాలనీ ప్రాంతంలో అసిఫ్ అనే నిందితుడిని గుర్తించినప్పుడు అతడు పోలీసులపై మూడు రౌండ్ల కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఒక తూటా హెడ్ కానిస్టేబుల్ రాజేశ్ ధరించిన బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌కు తగిలింది. ప్రతిచర్యగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక తూటా అసిఫ్ కుడి కాలికి తగిలింది. అనంతరం అతడిని ఆసుపత్రికి తరలించి అదుపులోకి తీసుకున్నారు. అతని విచారణ అనంతరం హేమంత్ సింగ్, అతని సోదరుడు ముఖేశ్‌లను కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. హేమంత్ న్యాయవాదిగా పనిచేస్తుండగా, ముఖేశ్ బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్నట్లు తాజా సమాచారం.

ఈ ఘటన వార్తా మాధ్యమాల్లో వెలుగులోకి రావడంతో సామాజిక మాధ్యమాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మైనర్లపై లైంగిక నేరాల్లో దర్యాప్తు వేగంగా పూర్తిచేయాలని, పోక్సో చట్టంలోని రక్షణలను సమర్థంగా అమలు చేయాలని, నేరం రుజువైతే చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా విచారణ ఆలస్యం కాకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి రోజుల్లో ఢిల్లీలో మైనర్లపై లైంగిక దాడులకు సంబంధించిన మరికొన్ని ఘటనలు కూడా వెలుగులోకి రావడం భద్రతపై ఆందోళనను మరింత పెంచుతోంది.

పార్కులు, నిర్మానుష్య ప్రాంతాల్లో వెలుతురు, సీసీటీవీ పర్యవేక్షణ, గస్తీ బలోపేతం చేయడంతో పాటు పోలీసుల పేరుతో ఎవరైనా బెదిరిస్తే వారి గుర్తింపును ధృవీకరించేలా యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఒక బాలికపై దాడి జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం మాత్రమే న్యాయం కాదు; మరో బాలికపై అలాంటి దాడి జరగకుండా వ్యవస్థను కట్టుదిట్టం చేయడమే నిజమైన న్యాయం. నేరస్తుడికి తప్పించుకునే మార్గం లేదనే నమ్మకం బాధితురాలికి కలగాలి---అదే చట్టానికి అసలైన గౌరవం, సమాజానికి నిజమైన భద్రత.

(మీడియా వార్త ఆధారంగా)



## గజల్ గాంధర్వునికి విశ్వ సంగీత శాంతి దూత పురస్కారం

### మారిషస్ గడ్డపై డా. గజల్ శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం

పోర్ట్ లూయిస్, సెప్టెంబర్ 23, జయ జయహే

ప్రపంచ సంగీత రంగంలో విశిష్ట గుర్తింపు పొందిన ప్రముఖ గజల్ గాయకుడు, మూడు గిన్నిస్ ప్రపంచ రికార్డుల గ్రహీత డా. గజల్ శ్రీనివాస్‌కు మారిషస్‌లో అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ శాంతి, భారతీయ సంస్కృతి, అహింసా సిద్ధాంతాల ప్రచారానికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా 'విశ్వ సంగీత శాంతి దూత' పురస్కారంతో సత్కరించారు. మారిషస్‌లోని 108 అడుగుల శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహం కొలువుదీరిన హరి హర దేవస్థాన ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ స్వయంగా డా. గజల్ శ్రీనివాస్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రపంచంలోని వివిధ భాషల్లో గానం చేస్తూ సంగీతం ద్వారా శాంతి సందేశాన్ని వ్యాప్తి చేయడంతో పాటు సనాతన ధర్మం, అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డా. గజల్ శ్రీనివాస్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా మారిషస్ దేశాధ్యక్షుడు పేర్కొన్నారు.హరి హర దేవస్థానం ప్రాంగణంలో అందించే ప్రతిష్ఠాత్మక పురస్కారానికి డా. గజల్ శ్రీనివాస్‌ను ఎంపిక చేయడం సముచితమైన నిర్ణయమని ఆయన కొనియాడారు. మారిషస్‌లో ప్రపంచ శాంతి, భారతీయ సంస్కృతి, సంగీత వారసత్వంపై డా. గజల్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు రెండు దేశాల సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయని అన్నారు.సంగీతాన్ని కేవలం వినోద సాధనంగా కాకుండా ప్రపంచ ప్రజలను ఏకం చేసే శక్తిగా మలచాలనే లక్ష్యంతో డా. గజల్ శ్రీనివాస్ సాగిస్తున్న ప్రస్థానానికి ఈ పురస్కారం మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది. మారిషస్ గడ్డపై లభించిన ఈ అరుదైన సత్కారం తెలుగు కళారంగానికి, భారతీయ సంగీత ప్రపంచానికి గర్వకారణంగా నిలిచింది.

## కుమారస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యేకు బీజేపీ సీనియర్ నాయకుడు గరికపాటి రమేష్‌బాబు వినతి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24, జయ జయహే



శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో ఒకటైన విజ్ఞానగిరి శ్రీ కుమారస్వామి ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ సీనియర్ నాయకుడు గరికపాటి రమేష్‌బాబు కోరారు.ఈ మేరకు గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ట్రస్టుబోర్డు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.కుమారస్వామి కొండ దిగువన ఉన్న వినాయకస్వామి ఆలయం ముందు ఖాళీ ప్రదేశంలో శాశ్వత రేకుల షెడ్డు నిర్మించాలని ఆయన కోరారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవానికి వర్షం వంటి ప్రతికూల పరిస్థితుల్లో ఇబ్బందులు లేకుండా ఈ షెడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పేదలు నిశ్చితార్థాలు, కేశఖండన, కర్ణభూషణాలు, చిన్నపాటి వివాహ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కూడా ఈ ప్రదేశాన్ని వినియోగించవచ్చని పేర్కొన్నారు.అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి కుమారస్వామి కొండకు వెళ్లే మార్గంలో ఆర్చ్ నిర్మించాలని కోరారు. దీనివల్ల ఆ మార్గంలో వెళ్లే యాత్రికులు, భక్తులు ఆలయాన్ని దర్శించుకునే అవకాశం ఏర్పడి నిత్యం భక్తుల సందర్శన పెరిగే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నెమళ్లూరు బుజ్జి, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు కన్నా వెంకటేశ్వర్లు, గంగపుత్ర గాంధీ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న సినీ నటి డింపుల్ హయాతీ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24, జయ జయహే

శ్రీకాళహస్తి ప్రముఖ సినీ నటి డింపుల్ హయాతీ గురువారం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాన్ని సందర్శించి శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన రాహు కేతు పూజలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.అనంతరం ఆలయ చైర్మన్ సాయి కొట్టేను డింపుల్ హయాతీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యత, భక్తులకు అందుతున్న సేవలపై చర్చించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఆమెకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఆధ్యాత్మిక వాతావరణం తనను ఆకట్టుకుందని డింపుల్ హయాతీ పేర్కొన్నారు.




## పవిత్రోత్సవాల్లో మూడో రోజు ప్రత్యేక పూజలు

### యాగశాలలో శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24, జయ జయహే

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మూడో రోజు ఉదయం శ్రీకాళహస్తీశ్వర స్వామివారితో పాటు పరివార దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో దీక్షా గురుకుల వారి ఆధ్వర్యంలో ఆగమ, వైదిక సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు యాగశాలలో నిర్వహించిన హోమాది కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు, దేవస్థానం బోర్డు సభ్యుడు గురప్ప శెట్టి, సహాయ కార్యనిర్వహణాధికారి విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఇన్‌స్పెక్టర్ హరి యాదవ్, అర్చకులు, వేద పండితులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి సమన్వయంతో స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి

నక్కపల్లి జయ జయహే అక్టోబర్ 24:-

నక్కపల్లిలోని హోం మంత్రి అనిత నివాసం వద్ద గురువారం నక్కపల్లి మండలం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల సమావేశం జరిగింది. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రానున్న ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ.కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో నియోజకవర్గంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. అలాగే విద్యా కమిటీ, మత్స్యకార సొసైటీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి వంగలపూడి అనితకు మంత్రి పదవి లభించడంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు.రానున్న రోజుల్లో నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కొప్పిశెట్టి




వెంకటేష్ తెలిపారు. కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు.

కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి,దార్ల కృష్ణ,టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ప్రగడ వీరబాబు, అనకాపల్లి జిల్లా టిడిపి మత్స్యకార విభాగ అధ్యక్షులు గోసల తాతారావు, నక్కపల్లి జనసేన మండల అధ్యక్షులు వెలగా సుధాకర్, బిజెపి నక్కపల్లి మండల అధ్యక్షులు నానాజీ, టిడిపి మహిళా అధ్యక్షురాలు మునిషా, వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com